ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రతలు | గరిష్ఠం : 34.0 | కనిష్ఠం : 22.0

ANDHRAJYOTHY

5



నారాయణపేట

జిల్లా వార్తలు

మంగళవారం 17 జూన్ 2025

ప్రభుత్వ వైద్య కళాశాలలో వసతులేవి?



● ఎన్ఎంసీ అసంతృప్తి

- ఐదింటిని గుర్తిస్తూ షోకాజ్ నోటీసులు జారీ
- ప్రధానంగా ఫ్యాకల్టీ, పడకలు, ఆపరేషన్ థియేటర్ల లేమి
- ఈనెలాఖరుకు అన్నింటినీ సరిచేస్తామని హామీ

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం), జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ ప్రభుత్వ వైద్యకళాశాలపై జాతీయ వైద్య మండలి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. కళాశాలలో వసతులు, ఫ్యాకల్టీ, పడకలు, ఆపరేషన్ థియేటర్ల లేమిని గుర్తించింది. మొత్తం 5 లోపాలను ఎత్తిచూపుతూ షోకాజు నోటీసులు జారీ చేసింది. అయితే ఆయా లోపాలను సరిదిద్దుకునేందుకు ఈనెల 18న ఢిల్లీలో నిర్వహించే సమావేశానికి హాజరుకావాలని ఆదేశించింది. ఆ రోజున కళాశాల భవితవ్యం తేలనుంది.

● వసతుల లేమి ఉందని..

జిల్లాలోని ప్రభుత్వ వైద్యకళాశాలలో 200 సీట్లకు అనుమతి కోసం కళాశాల అధికారులు దరఖాస్తు చేసుకున్నారు. దీంతో జాతీయ వైద్యమండలి (ఎన్ఎంసీ) బృందం కళాశాలతో పాటు జనరల్ ఆసుపత్రిని కూడా తనిఖీ చేసింది. రాష్ట్రంలోని 26 మెడికల్ కళాశాలతో పాటే పాలమూరు కళాశాలలో కూడా వసతుల లేమి ఉందని గుర్తించి తీవ్ర అసం తృప్తిని వ్యక్తం చేసింది.

దీంతో కళాశాలలో 5 లోపాలను గుర్తిస్తూ కళాశాలకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది.

● సరిచేస్తామని హామీ..

ఎన్ఎంసీ గుర్తించిన లోపాలపై సమీక్ష చేసేందుకు జిల్లా మెడికల్ కళాశాల అధికారులు సోమవారం డీఎంఈ కార్యాలయానికి వెళ్లారు. అక్కడ ఈ 5 లోపాలపై సమీక్షించారు. ఇందులో ఫ్యాకల్టీ నియామకాలపై చర్చించారు. ఈనెలాఖరు నాటికి పదోన్నతులు కల్పించడంతో పాటు కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ పద్ధతిన ఫ్యాకల్టీని నియమించేందుకు నిర్ణయించారు. అదేవిధంగా పడకల విషయంలో సరిపడినన్ని పడకలు ఉన్నప్పటికీ ఏర్పాటు చేయడానికి స్థలాభావం కారణంగా పెట్టలేకపోతున్నామని, కొత్త ఆసుపత్రి నిర్మాణం పూర్తయిన తర్వాత పడకల సంఖ్యను పెంచుకునే అవకాశం ఉందని నివేదికలో పేర్కొన్నారు. ఆపరేషన్ థియేటర్ల విషయంలో కూడా లోపాలు లేవని, మైనర్ ఓటీలు కూడా కొత్త ఆసుపత్రి ఏర్పాటైన తర్వాత పెంచుకుంటామని కూడా సమావేశం దృష్టికి తెచ్చారు. దీంతో పాటు కెడావర్లు 6 మాత్రమే తక్కువ ఉన్నాయని, అనాథ శవాలు గానీ, దాతల నుంచి గానీ సేకరిస్తామని కూడా తెలిపారు. హిస్టో ప్యాథాలజీ పరీక్షల సంఖ్యను కూడా పెంచుతామని పేర్కొన్నారు.



మహబూబ్‌నగర్‌లోని ప్రభుత్వ వైద్య కళాశాల

● గుర్తించిన 5 లోపాలు...

కళాశాలలో ముఖ్యంగా ఫ్యాకల్టీ లోపాలను గుర్తించింది. ప్రస్తుతం కళాశాలలో 150 మెడికల్ సీట్లు ఉన్నాయి. ఈ ఏడాది పదో బ్యాచ్ 200 ఎంబీబీఎస్ సీట్లకు అనుమతి కోసం దరఖాస్తు చేసుకోగా ఎన్ఎంసీ బృందం కళాశాల, ఆసుపత్రిలో తనిఖీలు చేపట్టింది. ఇందులో 5 లోపాలను గుర్తించింది. ప్రధానంగా ఫ్యాకల్టీ విషయంలో అసంతృప్తిని వ్యక్తం చేసింది. కళాశాలలో 200 సీట్లకుగానూ ఫ్యాకల్టీ(ప్రొఫెసర్లు, అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్లు) 232 మంది ఉండాలి. కానీ 129 మంది మాత్రమే ఉన్నారు. అదేవిధంగా సీనియర్ రెసిడెంట్లు, ట్యూటర్లు మొత్తం 115 మంది ఉండాల్సింది కేవలం 80 మంది మాత్రమే ఉన్నారు. దీంతో పాటు 770 పడకలకు గానూ 710 మాత్రం ఉన్నాయి. అవి కూడా ఖాళీగా ఉన్నాయి. మేజర్ ఆపరేషన్ థియేటర్లు 10కిగానూ 8, మైనర్ ఆపరేషన్ థియేటర్లు 5కు గానూ 3 ఉన్నాయి. అంతేకాకుండా కెడావర్(శవాలు) 18 ఉండాల్సింది 12 మాత్రమే ఉన్నాయి. హిస్టోపాథాలజీ పరీక్షలు కూడా తక్కువగా ఉన్నాయి. ఈ 5 లోపాలను గుర్తించి షోకాజు నోటీసులు జారీ చేసింది.

● రేపు తేలనున్న భవితవ్యం..

ఈనెల 18న ప్రభుత్వ వైద్య కళాశాల భవితవ్యం తేలనుంది. గుర్తించిన లోపాలు, షోకాజ్ నోటీసులపై సంజాయిషీ ఇవ్వాలని, ఇందుకోసం ఈనెల 18న ఢిల్లీకి రావాలని ఆరోగ్యశాఖ కార్యదర్శి, డీఎంఈలను ఆదేశించింది. అయితే ఆ లోపాలను సరిచేస్తామని అన్ని కళాశాలల నుంచి హామీ పత్రాలు ఇవ్వనున్నారు. కానీ వాటికి కూడా సంతృప్తి చెందక సీట్లు తగ్గిస్తారా..? జరిమానాలు విధిస్తారా..? మందలించి వదిలేస్తారా..? అనే దానిపై స్పష్టత రానుంది.

జగద్గురువుల రాకతో పాలమూరు పావనం

- మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ
- భక్తిశ్రద్ధలతో యుగమానోత్సవం

7



యుగమానోత్సవంలో మాట్లాడుతున్న జగద్గురు సిద్ధలింగ శివాచార్య మహాస్వామి

ఏదీ అలనాటి వైభవం?

- ఆదరణకు నోచుకోని ఆలయాలు
- శిథిలమైపోతున్న కోట గోడలు, బురుజులు
- కనుమరుగవుతున్న గట్టు చరిత్ర

6



శిథిలమైపోయి మొండి గోడలతో ఉన్న కోట గోడ

భవన నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలి

- కాడా అధికారి వెంకట్‌రెడ్డి
- కోస్గిలో ఇంజనీరింగ్ కళాశాల నిర్మాణ పనులు ప్రారంభం

6



అధికారులతో మాట్లాడుతున్న కాడా అధికారి వెంకట్‌రెడ్డి

చిన్నపిల్లల్లో అతిసార మరణాలు నివారించాలి

● కలెక్టర్ విజయేందిర బోయి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ తదితరులు

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం), జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఈ వర్షాకాలంలో అతిసార ప్రబలే అవకాశం ఉన్నందున చిన్నపిల్లల్లో మరణాలను నివారించాలని కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ భవనంలోని సమావేశ మందిరంలో అతిసార వ్యాధి నిరోధక అవగాహన గురించి ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్స్ సమావేశానికి కలెక్టర్ హాజరై పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అతిసార వ్యాధి పిల్లల్లో అతి ప్రమాదకరమైందని, అది తీవ్రమైతే ప్రాణనష్టం కలుగుతుందన్నారు. అందువలన అతిసార అవగాహన కార్యక్రమాన్ని ఈనెల 16 నుంచి జులై 31 వరకు నిర్వహించాలని ఆదేశించారు.

అదేవిధంగా ఐదేళ్లలోపు పిల్లలున్న ఇళ్లకు వెళ్లి ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయాలని, ప్రతీ పీహెచ్‌సీ, అంగన్‌వాడీ కేంద్రం, సబ్‌సెంటర్లలో ఓఆర్ఎస్ కార్నర్‌ను ఏర్పాటు చేయాలన్నారు. అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు చేతుల పరిశుభ్రత, అతిసార వ్యాప్తి, తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ఓఆర్ఎస్ ద్రావనం తయారు చేసే విధానాన్ని ప్రతి గ్రామంలో తల్లులు, గ్రామ ప్రజలకు వివరించాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కృష్ణ, జిల్లా సంక్షేమాధికారి జరీనాబేగం, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ పద్మజ, డాక్టర్ భాస్కర్‌నాయక్, మాస్ మీడియా అధికారి మంజుల, వైద్యాధికారులు, హెల్త్ ఎడ్యుకేటర్లు, ఫార్మసీ సూపర్‌వైజర్లు, డీఈవో, జిల్లా పంచాయతీ అధికారి తదితరులు పాల్గొన్నారు.

సర్కార్ బడి.. సమస్యల ఒడి

- సమస్యలతో సతమతం
- అరకొర వసతులతో విద్యాబోధన
- అద్దె భవనాల్లో విద్యార్థుల అవస్థలు
- శిథిలావస్థలో పలు పాఠశాల భవనాలు
- వంట గదులు, మరుగుదొడ్లు లేక ఇబ్బందులు
- ఉపాధ్యాయుల కొరతతో ఇక్కట్లు

సమస్యలతో సరస్వతీ నిలయాలు కునారిల్లుతున్నాయి. అద్దె భవనాలతో పాటు అసౌకర్యాలతో విద్యార్థులు బోధన ఇబ్బంది పడుతున్నారు. పలు పాఠశాలలకు సొంత భవనాలు లేవు. ఉపాధ్యాయుల కొరత అధికంగానే ఉన్నది. వంట గదులు, మరుగుదొడ్లు, మూత్రశాలలు లేవు. ఉన్నా నిర్వహణ సక్రమంగా లేక నిరుపయోగంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలు ప్రభుత్వ పాఠశాలల పరిస్థితిపై 'ఆంధ్రజ్యోతి' పరిశీలనలో వెల్లడైన కొన్ని వివరాలిలా..

ఆంధ్రజ్యోతి విజిట్

- మహబూబ్‌నగర్ విద్యావిభాగం/ నారాయణపేట

7





నారాయణపేట ఉర్దూమీడియం పాఠశాల పైకప్పు రంధ్రాలతో వర్షం నీరు తరగతిగదిలోకే..



పేటలో శిథిలమైన అద్దె భవనం (ప్రభుత్వ ఉర్దూ మీడియం పాఠశాల తరగతి గది)లో విద్యార్థుల బోధన



భూత్పూర్ మండలంలో అద్దె భవనంలో కొనసాగుతున్న భట్టుపల్లి ప్రాథమికోన్నత పాఠశాల

3 వేర్వేరు కేసుల్లో ముగ్గురికి జైలు శిక్ష

7

సుడి చెరువును పరిశీలించిన అధికారులు

భూత్పూర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలంలోని పాతమొల్గర గ్రామ శివారులో ఉన్న సుడి చెరువును కాలుష్య నియంత్రణ మండలి అధికారులు సోమవారం పరిశీలించారు. వెంకటేశ్వర పేపర్ మిల్లు నుంచి వెలువడే వ్యర్థ పదార్థాలతో నీరు కలుషితమై చెరువులో చేపలు మృతి చెందాయని, చెరువులోకి వ్యర్థ పదార్థాలను నిలిపి వేయాలంటూ సోమవారం పాతమొల్గర గ్రామస్థులు కలెక్టర్‌కు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. స్పందించిన కలెక్టర్ వెంటనే కాలుష్య నియంత్రణ మండలి హైదరాబాద్ వారికి సమాచారం ఇవ్వగా, కాలుష్య నియంత్రణ మండలి బోర్డు ఈఈ సురేష్‌బాబు పరిశీలించారు. నీటి నమూనాను సేకరించి, హైదరాబాద్ ల్యాబ్‌కు పంపుతామని, రిపోర్టు ఆధారంగా కంపెనీపై చర్యలు తీసుకుంటామని ఈఈ తెలిపారు.



పాతమొల్గర శివారులో కాలుష్యానికి గురైన సుడి చెరువును పరిశీలిస్తున్న అధికారులు

ఈ నెల 20న ఇంటర్నేషనల్ వెబినార్

- పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్

7

పచ్చదనం పరిరక్షణే లక్ష్యం

- పేట జిల్లాలో మొక్కల పెంపక లక్ష్యం 15.41 లక్షలు
- పాత మొక్కలు 9.99 లక్షలు
- అందుబాటులో ఉన్నవి 23 లక్షలు

నారాయణపేట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో మొక్కలు నాటి పచ్చదనాన్ని పరిరక్షించాలనే లక్ష్యంతో నారాయణపేట జిల్లా అధికార యంత్రాంగం లక్ష్యాన్ని నిర్దేశించింది. ఆయా మండలాల్లో పంచాయతీకో నర్సరీలో మొక్కలు పెంచేలా చర్యలు తీసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆయా మండలాల్లోని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నర్సరీల్లో పెంచిన 13 లక్షల మొక్కలు, జిల్లాలోని నాలుగు మునిసిపాలిటీల్లో 3.87 లక్షల మొక్కలు నాటాలని సంకల్పించి అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులను ఆదేశించారు. ప్రతి పంచాయతీలోని నర్సరీల్లో వివిధ రకాల టేకు, సుబాబుల్, వేప, కానుగ, చింత,మామిడి, నిమ్మ, జామ, కొబ్బరి, పూల మొక్కలు అందుబాటులో ఉన్నాయి. 11 మండలాల పరిధిలోని 274 పంచాయతీల పరిధిలో 23 లక్షల మొక్కలు నాటేందుకు సిద్ధం చేశారు. అయితే, కొత్తవి 15.41 లక్షల మొక్కలు, పాతవి 9.99 లక్షలు మొక్కలు గత ఏడాదికి సంబంధించి అందుబాటులో ఉన్నాయి. జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో వనమహోత్సవ నర్సరీలను ఉపాధి హామీ సిబ్బంది సిద్ధం చేసింది. ఇదివరకే పాలిథిన్ కవర్లలో ఎర్రమట్టిని, వర్మీ కంపోస్ట్ నింపి విత్తనాలు విత్తి మొక్కలు పెంచేలా చర్యలు తీసుకున్నారు. కాగా, గత ఏడాది 2024 జిల్లాలో 33,60,000 లక్షల మొక్కలు నర్సరీల్లో విత్తనాలు విత్తి పెంచేలా చర్యలు తీసుకున్నారు.



దామరగిద్ద మండలం దేశాయిపల్లి నర్సరీలో వివిధ రకాల మొక్కలు

ఇదివరకే గత ఏడాదికి సంబంధించి దాదాపు పది లక్షల మొక్కలు అందుబాటులో ఉండగా కొత్తగా పదమూడు లక్షల మొక్కలు నర్సరీలలో పెంచి సిద్ధం చేశారు. పాతవి, కొత్తవి కలిపి వచ్చే వానాకాలంలో జిల్లాలో 22,99,941 మొక్కల్ని సిద్ధం చేసి ఈ వనమహోత్సవంలో జిల్లాలో విస్తృతంగా మొక్కలు నాటనున్నారు. అయితే, వనమహోత్సవంలో జిల్లాలో 15.41 లక్షల మొక్కలు నాటాలనే ప్రభుత్వ లక్ష్యం నిర్దేశించింది. ఏటేటా మొక్కలు నాటే లక్ష్యం తగ్గుతూ వస్తున్నది. 2023లో 44 లక్షల మొక్కలు లక్ష్యం ఉండగా 2024లో 17 లక్షల పైచిలుకు మొక్కలు నాటగా, 2025 ఈసారి 15.41 లక్షల మొక్కలు నాటాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతూ లక్ష్యాన్ని తగ్గిస్తూ వస్తున్నది. అయితే ఎన్ని మొక్కలు నాటామనేది ముఖ్యం కాదని, నాటిన మొక్కలన్నీ బతికించి పచ్చదనం పెంచడమే ప్రాధానమని జిల్లా అధికారులు చెప్పుకొస్తున్నారు.

మండలాల వారీగా టార్గెట్ ఇలా..

మండలం	నర్సరీలు	నాటే మొక్కలు
మద్దూర్	49	1,51,500 లక్షలు
మక్తల్	39	1,20,600 లక్షలు
దామరగిద్ద	30	93,000 వేలు
నారాయణపేట	28	86,600 వేలు
కోస్గి	26	80,000 వేలు
ఊట్కూర్	23	71,600 వేలు
ధన్వాడ	20	62,000 వేలు
నర్వ	19	58,700 వేలు
మరికల్	17	52,500 వేలు
మాగనూర్	16	50,000 వేలు
కృష్ణా	13	40,000 వేలు
మొత్తం	274	8,66,500 లక్షలు
నాలుగు మునిసిపాలిటీల్లో		3.87 లక్షలు

బాధ్యతలు స్వీకరించిన మంత్రికి

పేట ఎమ్మెల్యే అభినందన

నారాయణపేట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య డైరీ డెవలప్‌మెంట్, క్రీడలు, యువజన శాఖ మంత్రిగా వాకిటి శ్రీహరి రాష్ట్ర సచివాలయంలో సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి ఆయనకు స్వీట్స్ తినిపించి శాలువాతో సత్కరించారు. పూల మొక్కను అందించి అభినందించారు.



మంత్రికి పూల మొక్కను అందించి అభినందిస్తున్న పేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి

గతం కంటే మెరుగు

ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం/నారాయణపేట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ పరీక్ష ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. ఫలితాల్లో మహబూబ్‌నగర్ జిల్లా గతం కంటే మెరుగుపడింది. గత నెలలో జరిగిన ఇంటర్ ప్రథమ, ద్వితీయ ఏడాది ఫలితాల్లో విద్యార్థులు గతం కంటే మంచి ఫలితాలు సాధించారు. మొదటి ఏడాదికి సంబంధించి మొత్తం 5315 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 3368 మంది పాస్ అయ్యారు. బాలుర కంటే బాలికలు పైచేయి సాధించారు. ద్వితీయంలో మొత్తం 2944 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 1469 మంది పాస్ అయ్యారు. ఇందులోనూ బాలికలే పైచేయి సాధించారు.

● నారాయణపేట జిల్లాలో ఫస్ట్ ఇయర్‌లో 2283 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 1318 మంది పాసై 57.73 శాతం ఉత్తీర్ణత సాధించారు. సెకండియర్‌లో 1316 మంది పరీక్షలు రాయగా 652 మంది పాసై 49.54 శాతం ఉత్తీర్ణత సాధించారు. వొకేషనల్‌లో ఫస్ట్ ఇయర్‌లో 125 మంది పరీక్షలు రాయగా 98 మంది పాసై 78.4 శాతం ఉత్తీర్ణత్త సాధించారు. సెకండియర్‌లో 63 మందికి 40 మంది విద్యార్థులు పాస్ కాగా, 63.49 శాతం ఉత్తీర్ణత సాధించారు. అయితే, రీకౌంటింగ్‌కు ఫీజ్ రూ.100, రీ వెరిఫికేషన్‌కు రూ.600 ఆన్‌లైన్ ద్వారా బోర్డ్ ఆఫ్ ఇంటర్ మీడియట్‌కు ఈనెల 17 నుంచి 23 వరకు దరఖాస్తులు చేసుకోవచ్చుని జిల్లా నోడల్ అధికారి సుదర్శన్‌రావు తెలిపారు.

పక్కాగా వంద రోజుల ప్రణాళిక

» విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

» సీడీఎంఏ జాయింట్ డైరెక్టర్ నారాయణరావు



పలు అంశాలపైన సూచనలు చేస్తున్న సీడీఎంఏ జాయింట్ డైరెక్టర్ నారాయణ రావు

పెబ్బేరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : 'వంద రోజుల ప్రణాళికను పక్కాగా అమలు చేయాలని మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ జాయింట్ డైరెక్టర్ నారాయణరావు ఆదేశించారు. మునిసిపాలిటీలో కొనసాగుతున్న వంద రోజుల ప్రణాళిక కార్యక్రమాన్ని సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొత్త కోట బైపాస్ రహదారి వెంట మొక్కలు నాటారు. అనంతరం మునిసిపల్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. మునిసిపాలిటీలో నెల కొన్న సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు వంద రోజుల ప్రణాళిక ఉపయోగపడుతుందని తెలిపారు. మునిసిపాలిటీ అభివృద్ధికి అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేయాలని సూచించారు. సకాలంలో పన్నులు వసూలు చేసి అభివృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో కమిషనర్ అశోక్‌రెడ్డి, మేనేజర్ గణేశ్‌బాబు, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ యోగేశ్‌కుమార్, బురాన్, ప్రశాంత్, మహేశ్, ఉమావతి, బాలీశ్వరశర్మ, అశోక్, దీప్తి, రాములమ్మ, రాజు, కృష్ణ, గంగన్న, పరమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలకు పంపించం

» గౌతమ్‌పల్లి గ్రామస్థుల తీర్మానం



తీర్మానం చేస్తున్న గ్రామస్థులు

తెలకపల్లి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలకు పంపించబోమని నాగర్‌కర్నూల్ జిల్లా, తెలకపల్లి మండల పరిధిలోని గౌతమ్‌పల్లి గ్రామస్థులు తీర్మానం చేసుకున్నారు. గౌతమ్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో సోమవారం తహసీల్దార్, ఎంఈవోలతో కలిసి సమావేశం ఏర్పాటు చేసుకొని, చర్చించుకున్నారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు చక్కగా పాఠాలు చెప్తున్నారని, ఈ సంవత్సరం ముగ్గురు విద్యార్థులకు గురుకుల పాఠశాలల్లో సీట్లు వచ్చాయని గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేశారు. పాఠశాల అభివృద్ధికి ఆర్థిక సాయం అందించాలని, వలంటీర్‌ను నియమించాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ జాకీర్ అలీ గ్రామస్థులను అభినందించారు. ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్యాబోధన ఉంటుందని, అన్ని వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. పాఠశాలలో చేర్పించేందుకు ముందుకొచ్చిన గ్రామస్థులకు ధన్యవాదాలు తెలిపారు. నమ్మకాన్ని నిలబెట్టుకోవడానికి శాయశక్తులా కృషి చేస్తామన్నారు. ఉపాధ్యాయులు రమేశ్, శ్రీరాములను అభినందించారు. విద్యార్థుల సంఖ్య పెరిగితే అన్ని సౌకర్యాలు సమకూరుస్తామని తెలిపారు. అవసరమైతే మరో టీచర్‌ను నియమిస్తామని చెప్పారు. గౌతమ్‌పల్లిని స్ఫూర్తిగా తీసుకొని మిగతా గ్రామాల ప్రజలు కూడా తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. అనంతరం విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫాంలను అందించారు.

యువజన కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలి

» రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శివచరణ్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షులు జక్కిడి శివచరణ్‌రెడ్డి

మహబూబ్‌నగర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెల్లడంలో యువజన కాంగ్రెస్ ప్రముఖ పాత్ర పోషించాలని రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డి అన్నారు. అందుకే అన్ని విభాగాల్లో పనిచేస్తున్న యువజన కాంగ్రెస్‌ను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. సోమవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు అవేజ్ అధ్యతన ఎగ్జిక్యూటివ్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన శివచరణ్‌రెడ్డి మాట్లాడుతూ మండల, గ్రామస్థాయి కమిటీలను పూర్తి చేయాలని కార్యకర్తలు, నాయకులు ఐవైసీ యాప్‌ను ఉపయోగించాలని కోరారు. రానున్న స్థానిక ఎన్నికల్లో యువజన కాంగ్రెస్ సత్తాచాటాలని, ఎక్కువ సీట్లు యువజన కాంగ్రెస్‌కు ఇచ్చేలా ప్రయత్నం చేస్తానని, అదే విధంగా పార్టీ నియమించిన అభ్యర్థుల విజయం కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు ఖాలెద్ అహ్మద్, అరవింద్‌కుమార్ యాదవ్, శివంత్‌రెడ్డి, సంధ్య, మాజిద్, వెంకట్, మహేశ్‌యాదవ్, శ్రీనుయాదవ్, మోహన్‌నాయక్, సంజీవ్‌రెడ్డి పాల్గొన్నారు.

భవన నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలి

» కాడా అధికారి వెంకట్‌రెడ్డి

» కోస్గిలో ఇంజనీరింగ్ కళాశాల భవన నిర్మాణ పనులు ప్రారంభం

కోస్గి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ కళాశాల భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని కాడా అధికారి వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం కోస్గి పట్టణంలోని 1737 సర్వే నెంబర్‌లో నిర్మించతలపెట్టిన ఇంజనీరింగ్ కళాశాల భవన నిర్మాణ పనులను ఆయన ప్రారంభించి, కాంట్రాక్టర్, అధి కారులతో మాట్లాడారు. నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. రేపటి నుంచి పనులు ప్రారంభించాల న్నారు. అనంతరం ప్రభుత్వ బాలికల వసతి గృ హన్ని ఆయన తనిఖీ చేశారు. హాస్టల్ భవనం నూతనంగా నిర్మించాలని, అందుకు ప్రణాళికలు తయారు చేయాలని స్థాని క అధికారులను ఆదే శించారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 800 మంది విద్యార్థులు ఉ న్నారని, సరిపడా తరగతి గదులు, ఆట స్థలం లేదని కాంగ్రెస్ నాయకులు కాడా అధికారి దృ ష్టికి తీసుకెళ్లారు. జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ వార్లవిజయ్‌కుమార్, పార్టీ మండల అధ్య క్షుడు రఘువర్ధన్‌రెడ్డి, నాయకులు నరేందర్, తు దుం శ్రీనివాస్, తహసీల్దార్ శ్రీనివాసులు ఉన్నారు.

ఏదీ అలనాటి వైభవం?

అలనాటి వైభవం కాలగర్భంలో కలిసిపోతోంది.. ఘన చరిత్ర కనుమరుగవుతోంది. జోగుళాంబ గద్వాల జిల్లాలోని గట్టు గ్రామ దుస్థితి ఇది.. ఈ ప్రాంతం శ్రీకృష్ణదేవరాయుల ఏలుబడి కింద ఉండేది. అప్పట్లో దీనిని బంగారు గట్టుగా పిలిచేవారు. శత్రువుల దాడుల నుంచి రక్షణకు అప్పటి పాలకులు గ్రామం చుట్టు ఎత్తయిన కోట గోడలను నిర్మించారు. భారీ ప్రవేశ ద్వారాలను ఏర్పాటు చేశారు. శత్రువుల రాకను ముందుగానే గుర్తించేందుకు కోటకు నలువైపులా నిఘా కేంద్రాలను ఏర్పాటు చేశారు.

- గట్టు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి)

» ఆదరణకు నోచుకోని ఆలయాలు

» శిథిలమైపోతున్న కోట గోడలు, బురుజులు

» కనుమరుగవుతున్న గత చరిత్ర




కోట లోపలికి వెళ్లేందుకు ఏర్పాటు చేసుకున్న ముఖద్వారం



శత్రువులపై దాడి చేయడానికి రాతితో నిర్మించిన బురుజులు



రాయల కాలంలో నిర్మించిన నిరాదరణకు గురి అవుతూ దూపదీప నైవేద్యాలకు నోచుకోని ప్రాశస్త్యం గల రంగనాథస్వామి ఆలయం



శిథిలమైపోయి మొండి గోడలతో ఉన్న కోట గోడలు

గట్టు.. ఆయువు పట్టు

విజయనగర సామ్రాజ్యానికి గట్టు ఆయువుపట్టుగా ఉండేదని, ఇక్కడ రత్నాలు, ముత్యాలను, వజ్రాలను రాసులుగా పోసి విక్రయించేవారని స్థానికులు చెప్తుంటారు. రాజ్యంలోనే కీలక ప్రాంతం కావడంతో చీకటి పడిందంటే కోట లోపలికి ఎవ్వరిని వెళ్లనిచ్చేవారు కాదు. కోట చుట్టూ పటిష్ఠమైన కాపలా ఉండేది. సైనికులకు ఇక్కడే శిక్షణ కూడా ఇచ్చే వారని చెప్తుంటారు. గట్టు గ్రామం వేలాది ఎకరాల్లో దట్టమైన అటవీ ప్రాంతం విస్తరించి ఉండటంతో అటవీ జంతువుల సంచారం అధికంగా ఉండేది. దీంతో మృగాల బారి నుంచి కాపాడుకోవడానికి వ్యాపారులు, ప్రయాణికులు ఆయుధాలను వెంట తీసుకెళ్లే వారని స్థానిక పెద్దలు కథలు కథలుగా చెప్పుకుంటుంటారు. ఈ ప్రాంత రైతులు పంటలను సాగు చేసుకునేందుకు గ్రామం పక్కనే పెద్ద చెరువును నిర్మించారు. ఆ నీటితో వేలాది ఎకరాల్లో పంటలు సాగు చేసేవారు. ప్రజలకు తాగునీటిని సరఫరా చేసేవారు. ఈ చెరువు ఇప్పటికీ ప్రజలకు ఉపయోగపడుతూనే ఉంది.

పరాజయంతో సంస్థానంలో విలీనం

శ్రీకృష్ణదేవరాయులు పాలన అనంతరం రాజ్యాన్ని అధిష్ఠించిన చక్రవర్తులు గట్టు ప్రాంతంపై పట్టు సాధించలేక పోవడంతో శత్రువుల దాడి అధికమైంది. ఇక్కడ ఉన్న సంపదను దొంగలు కొల్లగొట్టుక పోయారు. గట్టు, ఆరగిద్ద గ్రామాల మధ్య గద్వాల సోమానాద్రిరాజుకు, రాయచూరు నవాబులకు మధ్య భారీ యుద్ధం జరిగింది. ఈ యుద్ధంలో గద్వాల రాజు విజయం సాధించడంతో ఈ ప్రాంతం సంస్థానంలోకి విలీనమైందని చరిత్ర చెపుతున్నది.

తవ్వకాలలో బయటపడ్డ విలువైన వస్తువులు

పురావస్తుశాఖ అధికారులు ఈ ప్రాంతంలో 50 ఏళ్ల క్రితం తవ్వకాలు జరిపారు. ఆ సమయంలో రాజుల కాలం నాటి ఖడ్గాలు, అభరణాలు, సైన్యం ఉపయోగించిన వస్తువులు, బంగారం వంటివి బయటపడ్డాయి. లభ్యమైన వాటిలో కొన్ని పరుల పాలు కాగా, మరికొన్నింటిని హైదరాబాద్‌లోని సాలర్జంగ్ మ్యూజియంలో భద్రపరిచినట్లు సమాచారం. అలాగే దీనిని రక్షిత ప్రాంతంగా ప్రకటించి ఎలాంటి తవ్వకాలూ జరుపరాదని ఆదేశాలు జారీ చేసింది. అయినా దుండగులు ఈ ప్రాంతంలో తవ్వకాలు జరుపుతూనే ఉంటారు.

ధూపదీప నైవేద్యాలు కరువు

రాయల కాలంలో గట్టులో ఎన్నో ఆలయాలు నిర్మించారు. వీటిలో సంత బజారులోని ప్రాథమిక పాఠశాల వెనుకనున్న రంగనాథస్వామి ఆలయం ప్రధానమైంది. అలాగే వేంకటేశ్వర స్వామి ఆలయంలో పాటు మరికొన్ని ఆలయాలున్నాయి. వాటికి విలువైన భూములు ఉన్నప్పటికీ ధూప దీప నైవేద్యాలు కరువయ్యాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఆలయాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

గట్టు చరిత్రను భావితరాలకు అందించాలి



ఎంతో ప్రాశస్త్యం గల గట్టు చరిత్రను భావి తరాలకు అందించాలి. గ్రామంలో శిథిలం అవుతున్న చారిత్రక సంపదను కాపాడాలి. పురావస్తుశాఖ స్పందించి పురాతన కట్టడాలు, కోట బురుజులు, ఆలయాల సంరక్షణకు చర్యలు తీసుకోవాలి. గట్టు చరిత్రను అధ్యయనం చేసి, పురావస్తు శాఖ అధికారులకు వివరించేందుకు నా వంతు ప్రయత్నం చేస్తాను.

- డాక్టర్ ఆంజనేయగౌడు, తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్

చదువుకుంటూనే.. ఆటల్లో శిక్షణకు అవకాశం

» క్రీడా పాఠశాలల్లో విద్యార్థుల ఎంపికలకు కసరత్తు

» వనపర్తి జిల్లా నుంచి 39 మంది విద్యార్థులు దరఖాస్తు

» మూడు స్థాయిల్లో కొనసాగనున్న ఎంపిక ప్రక్రియ

» 18, 19వ తేదీల్లో మండల స్థాయి ఎంపికలు



వనపర్తి రాజీవ్ చౌరస్తా, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుకుంటూనే క్రీడల్లో శిక్షణ పొందుతూ రాణించే అవకాశాన్ని ప్రభుత్వం కల్పిస్తోంది. అందుకోసం తెలంగాణ ప్రభుత్వం క్రీడా పాఠశాలలను నిర్వహిస్తోంది. రాష్ట్రంలోని హకీంపేట్, కరీంనగర్, ఆదిలాబాద్‌లలో ఈ పాఠశాలలున్నాయి.

ఆయా పాఠశాలల్లో నాలుగవ తరగతిలో ప్రవేశం కోసం తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ విద్యార్థుల ఎంపిక ప్రక్రియను ఈనెల 16న ప్రారంభించింది. అందుకోసం జిల్లాకు చెందిన 39 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. విద్యార్థుల ఎంపిక మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలలో మూడు విడతలుగా నిర్వహించనున్నారు. వాటిల్లో సత్తాచాటి ఎంపికైన విద్యార్థులకు ఈ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు, ఉత్తమ క్రీడా శిక్షణను అందిస్తారు.

మూడు పాఠశాలల్లో 120 సీట్లు

రాష్ట్రంలోని హకీంపేట్, కరీంనగర్, ఆదిలాబాద్ క్రీడా పాఠశాలల్లో 120 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ప్రతీ పాఠశాలలో బాలురకు 20, బాలికలకు 20 సీట్ల చొప్పున 120 మంది విద్యార్థులకు అవకాశం లభించనుంది. ఈ నెల 15న దరఖాస్తుల ప్రక్రియ ముగిసింది. 18, 19వ తేదీల్లో మండల స్థాయిలో విద్యార్థుల ఎంపిక జరుగనున్నది. అందులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను 25వ తేదీన జిల్లా కేంద్రంలోని బాలకిష్టయ్య క్రీడా ప్రాంగణంలో ఎంపిక ప్రక్రియను నిర్వహిస్తారు. అందులో ఉత్తీర్ణులైన వారు హకీంపేట్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి ఎంపికలకు హాజరవుతారు. ఇక్కడ వచ్చేనెల 1 నుంచి 5వ తేదీ వరకు ఎంపికలు నిర్వహిస్తారు. ఇక్కడ అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పాఠశాలల్లో ప్రవేశం కల్పిస్తారు.

క్రీడా పాఠశాలల్లో ఉజ్వల భవిష్యత్తు



క్రీడా పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన చదువుతో పాటు క్రీడల్లో ఉత్తమ శిక్షణ లభిస్తుంది. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు తోడ్పాటు అందుతుంది. గతంలో దరఖాస్తు చేసుకోని వారు ఆయా మండలాల ఎంఈవోలను కలిసి దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

- సుధీర్ కుమార్‌రెడ్డి, జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి

విద్యార్థుల ఎంపిక ఇలా..

క్రీడా పాఠశాలల్లో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు పలు రకాల పరీక్షలు నిర్వహిస్తారు. 30 మీటర్ల ఫ్లయింగ్ స్టార్ట్, స్టాండింగ్ బ్రాడ్ జంప్, 800 మీటర్ల పరుగు, 6/10 మీటర్ల షటిల్‌రన్, మెడిసిన్ బాల్‌త్రో, వర్టికల్ జంప్, ఫ్లెక్సిబిలిటీ టెస్ట్, ఎత్తు, బరువు కొలతలు నిర్వహిస్తారు. వాటి ద్వారా విద్యార్థి క్రీడా, శారీరక సామర్థ్యాన్ని పరిశీలిస్తున్నారు.

న్యాయం జరిగే వరకు పోరాటం

» ఎన్‌హెచ్‌పీఎస్ జిల్లా చైర్మన్ రంజిత్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా చైర్మన్ రంజిత్‌కుమార్

గద్వాల టౌన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : సీడ్ పత్తి రైతులకు న్యాయం జరిగే వరకు పోరాడుతామని నడిగడ్డ హక్కుల పోరాట సమితి (ఎన్‌హెచ్‌పీఎస్) జిల్లా చైర్మన్ రంజిత్‌కుమార్ అన్నారు. విత్తన ఉత్పత్తి రైతులకు పాస్, ఫెయిల్‌తో సంబంధం లేకుండా కంపెనీలు సొమ్ము చెల్లించాలని డిమాండ్ చేశారు. జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని పోరాట సమితి కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల కొంత మంది రైతుల విత్తనాలు ఫెయిల్ అయినట్లు ఆర్గనైజర్లు చెప్తున్నందున రైతులందరూ జర్మినేషన్ టెస్టుకు సంబంధించిన రశీదు, లాట్ నంబరు, రైతు పేరు, చిరునామా సహా పూర్తి వివరాలు తమకు అందించాలని సూచించారు. ఇటీవల జిల్లా పర్యటనకు వచ్చిన రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డికి సీడ్‌పత్తి రైతుల స్థితిగతులు, కంపెనీలు, ఆర్గనైజర్లు కుమ్మక్కై చేస్తున్న మోసాలను వివరించామన్నారు. అందుకు సానుకూలంగా స్పందించిన చైర్మన్ రైతులకు న్యాయం చేయడమే ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేసినట్లు తెలిపారు. ఆ వివరాలను కలెక్టర్‌కు నివేదిస్తామని, అనంతరం రైతుల పక్షాన పోరాట ప్రణాళికను సిద్ధం చేసేందుకు వీలు కలుగుతుందని చెప్పారు. ఒప్పంద వ్యవసాయం చేయాలనుకునే వారు జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. దిగుబడి రాక రైతులకు నష్టం వచ్చినా, అగ్రిమెంట్ మేరకు పరిహారం చెల్లించాల్సిందేనని కమిషన్ స్పష్టం చేసిన విషయాన్ని రైతులకు వివరించారు. సమావేశంలో పోరాట సమితి జిల్లా కన్వీనర్ బుచ్చిబాబు, కార్యదర్శి లవన్న, నాయకులు వెంకట్రాములు, గౌని శ్రీనివాస్ యాదవ్, ప్రేమ్‌రాజ్, చిన్నరాములు, లక్ష్మన్న పాల్గొన్నారు.

మహిళలతో గౌరవప్రదంగా మెలగాలి

» జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రజని



సదస్సులో మాట్లాడుతున్న న్యాయాధికారి రజని

వనపర్తి లీగల్ కంట్రిబ్యూటర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : తల్లిదండ్రులు, మహిళలతో గౌరవప్రదంగా మెలగాలని జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ న్యాయ మూర్తి వి.రజని అన్నారు. సోమవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని శ్రీకృష్ణ దేవరాయ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కళాశాల సిబ్బందికి చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ... పని ప్రదేశా ల్లో మహిళల రక్షణ కోసం కచ్చితంగా నలుగురితో కూడిన ఇంటర్నల్ కంప్లెంట్ కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. పని ప్రదేశాలలో లైంగికంగా వేధించబడిన మహిళలు ధైర్యంగా కార్యాలయంలో ఉన్న ఇంటర్నల్ కంప్లైంట్ కమిటీలో ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. డిప్యూటీ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ జి.ఉత్త రయ్య, కళాశాల ప్రధానోపాధ్యాయులు బి.జగన్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

చోరీలు చేస్తున్న ముగ్గురి అరెస్ట్

» 14 తులాల బంగారం,

» 24 తులాల వెండి వస్తువుల స్వాధీనం

వనస్థలిపురం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): చోరీలకు పాల్పడుతున్న పాత నేరస్థుడితోపాటు అతడికి సహకరిస్తున్న మరో ఇద్దరిని వనస్థలిపురం పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. కమ్మగూడకు చెందిన గంప అనురాధ(42) తన ఇంటి సమీపంలోగల చాక్లెట్ కంపెనీలో పనిచేస్తూ జీవిస్తోంది. నాగర్‌కర్నూల్ జిల్లా నార్లపూర్ మండలం రామ్‌నాయక్ తండాకు చెందిన పాత నేరస్థుడు మండ్ల శివ(32), ఉదావత్ బాష(33), గొగుల విజయ్(28) ఈనెల 9వ తేదీన అనురాధ ఇంట్లో 14 తులాల బంగారం, 24 తులాల వెండి వస్తువులను అపహరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు సీసీ కెమెరాల ఫుటేజీల ఆధారంతో నిందితులను పట్టుకున్నారు. వారి నుంచి 14 తులాల బంగారం, 24 తులాల వెండి వస్తువులు, ద్విచక్రవాహనం, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. మండ్ల శివ 12 దొంగతనాల కేసుల్లో నిందితుడని ఇన్‌స్పెక్టర్ టి. మహేష్ తెలిపారు. నిందితులను రిమాండ్‌కు తరలించారు.

వ్యవసాయ పరిశ్రమల స్థాపనపై ప్రత్యేక శిక్షణ

బిజినేపల్లి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): షెడ్యూల్డ్ కులాల నిరుద్యోగ యువ పట్టభద్రుల కోసం వ్యవసాయ అనుబంధ పరిశ్రమల స్థాపనపై ప్రత్యేక శిక్షణను ఐసీఏఆర్, భారతీయ నూనె గింజల పరిశోధన సంస్థ, రాజేంద్రనగర్‌లో ఈ నెల 30, జూలై 1 తేదీల్లో రెండు రోజుల పాటు వ్యవస్థాపక అభివృద్ధి శిక్షణ నిర్వహించనున్నట్లు సోమవారం ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్త దివ్య తెలిపారు. ఈ శిక్షణలో సేంద్రియ, ప్రకృతి పద్ధతులను ప్రోత్సహించే దిశగా, మైక్రోబియల్ బయోపెస్టిసైడ్స్, బయోపాలిమర్, సాంకేతికతలు, ఆయిల్ ప్రాసెసింగ్ యూనిట్, భూసార పరీక్ష కేంద్రం, విత్తనోత్పత్తి వంటి యూనిట్ల స్థాపనకు అవసరమైన అంశాలను వివరించి వాటి స్థాపన అవసరమైన పెట్టుబడి రుణాలు, సబ్సిడీ పథకాలు తదితర వాటిపై నాబార్డు అధికారులు, ఏజీ హబ్ సీఈవో విజయ్ వివిధ రంగాల నిష్ణాతులతో అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. కనీసం ఇంటర్మీడియేట్, డిగ్రీ పూర్తి చేసి 35 ఏళ్ల లోపు షెడ్యూల్డ్ కులాలకు చెందిన నిరుద్యోగ యువత శిక్షణలో పాల్గొనవచ్చని తెలిపారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి సౌకర్యం కల్పించనునట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న యువత పేరు నమోదు చేసుకోవడానికి 8247371710, 9398319106 నంబర్లను సంప్రదించాలని కోరారు.

నిజాయతీ చాటుకున్న కండక్టర్

» ప్రయాణికురాలికి బ్యాగు అప్పగింత



కొల్లాపూర్ ఆర్టీసీ బస్టాండ్ మహిళకు బ్యాగును అందజేస్తున్న మహిళా కండక్టర్

కొల్లాపూర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ బస్సులో మరిచిపోయిన బ్యాగును ప్రయాణికురాలికి అప్పగించి కండక్టర్ నిజాయితీ చాటుకున్నాడు. నాగర్‌కర్నూల్ జిల్లా, పెద్ద కొత్తపల్లి మండలంలోని యాపట్ల గ్రామానికి చెందిన కేశమ్మ సోమవారం హైదరాబాద్ నుంచి ఊరికి వచ్చేందుకు బస్సులో ఎక్కింది. బస్సు నాగర్‌కర్నూల్ బస్టాండ్‌కు చేరుకున్న తర్వాత, మూత్ర విసర్జన కోసం దిగింది. తిరిగి వచ్చే సరికి బస్సు వెళ్లిపోయింది. దీంతో ఆమె కొల్లాపూర్ డిపోకు బస్సు ఎక్కి కండక్టర్ సాయిగీతకు విషయం తెలిపింది. ఆమె హైదరాబాద్ బస్సు వివరాలను తెలుసుకొని, సిబ్బందికి విషయం చెప్పి బ్యాగ్‌ను తెప్పించింది. సాయంత్రం కొల్లాపూర్ బస్టాండ్‌లో కంట్రోలర్ మురళీగౌడ్ సమక్షంలో ప్రయాణికురాలు కేశమ్మకు అప్పగించారు. ఆ బ్యాగులో 52 తులాల వెండి ఆభరణాలు ఉన్నట్లు ఆమె తెలిపింది. కండక్టర్ సాయిగీత, డ్రైవర్ కృష్ణయ్యలకు కృతజ్ఞతలు తెలిపింది.

అమానవీయం

» తల్లిని బస్టాండ్‌లో వదిలేసిన కొడుకు



ఆత్మకూరు బస్టాండ్‌లో ఉన్న వృద్ధురాలు

ఆత్మకూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : కనిపెంచిన తల్లిని భారంగా భావించిన ఓ కొడుకు ఆమెను నిర్దాక్షిణ్యంగా బస్టాండ్‌లో వదిలేసి వెళ్లిపోయాడు. ఈ అమానవీయ సంఘటన వనపర్తి జిల్లా, ఆత్మకూరు పట్టణంలో జరిగింది. బాధితురాలు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వనపర్తి పట్టణం పీర్లగుట్ట కాలనీకి చెందిన పార్వతమ్మను మూడు రోజుల క్రితం కుమారుడు భాస్కర్ కొట్టాడు. దీంతో ఆమె పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి విషయాన్ని చెప్పింది. పోలీసులు అతడిని పిలిచి మాట్లాడారు. ఎందుకు కొట్టావని నిలదీశారు. తల్లిని ఇంటికి తీసుకెళ్లాలని సూచించారు. వైద్యం చేయించేందుకు హైదరాబాద్‌కు తీసుకెళ్తానని తల్లికి చెప్పాడు. కానీ ఆత్మకూరు బస్టాండ్‌లో వదిలేసి వెళ్లిపోయాడు. ఆమె కాలికి గాయం కావడంతో కనీసం బస్సు ఎక్కి వెళ్లే పరిస్థితి కూడా లేదు.

క్రైం కార్నర్

మహిళ దారుణ హత్య


బోయ అనిత (ఫైల్)

గద్వాల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : జోగులాంబ గద్వాల జిల్లా, కేటీదొడ్డి మండలం పాతపాలెం గ్రామంలో సోమవారం తెల్లవారు జామున ఓ మహిళ దారుణ హత్యకు గురైంది. సంఘటనకు సంబంధించి కేటీదొడ్డి ఎస్‌ఐ శ్రీనివాసులు, గ్రామస్థుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బోయ అనిత (26), ఆంజనేయులు దంపతులకు ఇద్దరు పిల్లలున్నారు. భర్త ఆంజనేయులు హైదరాబాద్‌లో ఉంటూ కూలి పనులు చేస్తున్నాడు. అప్పుడప్పుడు గ్రామానికి వచ్చి వెళ్తుంటాడు. ఇటీవల ఏరువాక పౌర్ణమి పండుగకు ఆయన వచ్చి వెళ్లాడు. ఇంట్లో ఇద్దరు పిల్లలతో ఉంటున్న ఆమె సోమవారం హత్యకు గురయ్యింది. మంగళవారం ఉదయం 9 నెలల చంటిపాప, నాలుగేళ్ల బాబు ఆమె మీద పడి ఏడుస్తుండగా పక్కింటి వారు వెళ్లి చూశారు. అప్పటికే ఆమె చనిపోయి ఉంది. మెడ చుట్టూ ఉరి వేసినట్లు ఆనవాళ్లు ఉండటంతో సమీపంలో ఉండే కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. డాగ్‌స్కాడ్ బృందం వచ్చి చూడగా, కుక్కలు గ్రామంలో అక్కడక్కడ ఆగుతూ.. ఊరి బయటకు చేరుకున్నాయి. అక్కడ ఎవరో మద్యం తాగిన ఆనవాళ్లు కనిపించాయి. ఆమెకు ఎవరితో నైనా వివాదాలున్నాయని అని పోలీసులు ఆరా తీయగా, రెండు నెలల క్రితం ఇంటి దగ్గర వాళ్లతో గొడవ జరిగిందని, ఆమె వారిపై కేసు పెట్టిందని తెలిసింది. మృతదేహాన్ని గద్వాల ఏరియా ఆసుపత్రికి తరలించారు. సోదరుడు అశోక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

3 వేర్వేరు కేసుల్లో

ముగ్గురికి జైలు శిక్ష

మహబూబ్‌నగర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని వేర్వేరు పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసుల్లో ముగ్గురికి జైలు శిక్ష విధిస్తూ న్యాయాధికారులు తీర్పు వెల్లడించారు. టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 2024లో నమోదైన అసభ్య చిత్రాల ప్రదర్శన, దౌర్జన్యం సంఘటనపై నవాబ్‌పేట మండలంలోని కామారం గ్రామానికి చెందిన చిలుకల కృష్ణయ్యపై కేసు నమోదైంది. నేరం రుజువు కావడంతో అతడికి 8 నెలల కారాగార శిక్ష విధిస్తూ మూడవ అదనపు జేఎఫ్‌సీఎం, ప్రత్యేక మొబైల్ కోర్టు న్యాయాధికారి మహ్మద్ మునావర్ హుస్సేన్ తీర్పు ఇచ్చారు. గండీడ్ మండలంలోని కొండాపూర్‌కు చెందిన గొల్లకృష్ణయ్యపై 2022లో లైంగిక వేధింపుల కేసు నమోదైంది. అతడికి 3 సంవత్సరాల జైలుశిక్ష, రూ. 1000 జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. మరో కేసులో మిడ్జిల్ మండలం, రాణిపేటకు చెందిన కర్నెకోట నిరంజన్‌కు సంవత్సరం జైలు శిక్ష, రూ.5 వేలు జరిమానా విధిస్తూ న్యాయాధికారి నిహారిక తీర్పు వెల్లడించారు. ఈ సందర్భంగా ఎస్పీ జానకి మాట్లాడుతూ పోలీసులు కేసులను ఛేదించి, సరైన సాక్ష్యాధారాలను కోర్టుకు సమర్పించడంతో దోషులకు శిక్ష పడిందని తెలిపారు. వారి కృషిని అభినందించారు.

దంపతులపై దొంగల దాడి

కొత్తకోట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : దంపతులపై దొంగలు రాళ్లతో దాడి చేసి పారిపోయారు. ఈ సంఘటన వనపర్తి జిల్లా, కొత్తకోట మండలంలోని అమడబాకుల గ్రామంలో ఆదివారం రాత్రి జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వడ్డె శంకర్ ఇంటి ముందు కమ్మిన కోళ్లను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నించారు. దీంతో కోళ్లు అరవడంతో వడ్డె శంకర్, భార్య శిరీశ బయటకు వచ్చి వారిని అడ్డుకునేందుకు యత్నించారు. దీంతో దొంగలు వారిపై రాళ్లతో దాడి చేసి పరారయ్యారు. వారు 100 నెంబర్‌కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం అందించడంతో వారు అక్కడికి చేరుకున్నారు. దొంగల కోసం పరిసరాల్లో గాలించారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు.

రెండు స్కూల్ బస్సులు సీజ్


పెబ్బేరులోని ఓ ప్రైవేటు పాఠశాల బస్సును సీజ్ చేసిన మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వాసుదేవరావు

పెబ్బేరు రూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : సరైన అనుమతులు, ఫిట్‌నెస్ లేని రెండు పాఠశాల బస్సులను సోమవారం సీజ్ చేశారు. మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వాసుదేవరావు మూడు బస్సులను తనిఖీ చేశారు. అందులో పెబ్బేరు పట్టణంలోని గాంధీ మెమోరియల్ స్కూల్, మాంటిస్సోరి ప్లే స్కూల్ బస్సులకు సరైన అనుమతి పత్రాలు లేవు. నిబంధనలకు విరుద్ధంగా ఎక్కువ మంది విద్యార్థులను ఎక్కించుకున్నారు. దీంతో వాటిని సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు. ప్రతీ స్కూల్ బస్సుకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్, ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని తెలిపారు. లేకపోతే సీజ్ చేస్తామని హెచ్చరించారు.

లైంగిక వేధింపుల కేసులో..

మాజీ సర్పంచ్‌కు జైలుశిక్ష

మిడ్జిల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : లైంగిక వేధింపుల కేసులో ఓ మాజీ సర్పంచులు జైలు శిక్ష పడింది. మహబూబ్‌నగర్ జిల్లా, మిడ్జిల్ మండలంలోని రాణిపేట మాజీ సర్పంచ్ నిరంజన్ 2020లో పదవిలో ఉన్నప్పుడు లైంగిక వేధింపుల కేసు నమోదయ్యింది. అప్పటి ఎస్‌ఐ కేసు దర్యాప్తు చేపట్టారు. సోమవారం నిరంజన్‌ను జడ్చర్ల కోర్టులో ప్రవేశపెట్టారు. అతడిపై నేరం రుజువు కావడంతో సంవత్సరం జైలు శిక్షతో పాటు, రూ. 5 వేల జరిమానా విధిస్తూ న్యాయాధికారి జుత్తూరు నిహారిక తీర్పు వెల్లడించినట్లు ఎస్‌ఐ శివనాగేశ్వర్ నాయుడు, కోర్టు కానిస్టేబుల్ రమేశ్ తెలిపారు.

కేఎల్‌ఐ కాల్వలో పడి వ్యక్తి మృతి

మిడ్జిల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, మిడ్జిల్ మండల కేంద్రానికి చెందిన వస్పరి నాగయ్య (32) కొత్తూరు రోడ్డులోని కేఎల్‌ఐ కాల్వలో పడి మృతి చెందాడు. ఎస్‌ఐ శివనాగేశ్వర్ నాయుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కేఎల్‌ఐ కాల్వలో గుర్తు తెలియని మృత దేహం ఉన్నట్లు సోమవారం సమాచారం రావడంతో పోలీసులు వెళ్లి చూశారు. స్థానికుల సమాచారం మేరకు అతడు మిడ్జిల్ గ్రామానికి చెందిన నాగయ్యగా గుర్తించారు. అతడు ఆదివారం రాత్రి 10 గంటల ప్రాంతంలో కాల్వ వద్ద ఉన్న బోరు మోటరును ఆఫ్ చేసి వస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. అతడికి మూర్ఛవ్యాధి ఉండటంతో కాలువలో పడిపోయినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ మేరకు భార్య సరోజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చెరువులో పడి యువకుడు..

బాలానగర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : చెరువులో పడి ఓ యువకుడు మృతి చెందాడు. మహబూబ్‌నగర్ జిల్లా, బాలానగర్ మండలంలోని వీరన్నపల్లి తండాలో ఈ సంఘటన జరిగింది. ఏఎస్‌ఐ సుజ్ఞానం కథనం మేరకు.. తండాకు చెందిన కేతావత్ రవి (22) ఎక్స్‌కవేటర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అ తడు కొంతకాలంగా మద్యానికి బానిస అయ్యాడు. ఈ నెల 13న మద్యం తాగడంతో కుటుంబ సభ్యులు మందలించారు. దీంతో ఆయన బయటకు వెళ్లి తిరిగి రాలేదు. సోమవారం అతడి మృతదేహం చెరువులో కనిపించడంతో స్థానికులు కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీసి జడ్చర్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.


శిథిలస్థితిలో మెన్నిపాడు పాఠశాల భవనం


ఖిల్లాఘణపూర్ రోడ్డు మీద తండా ప్రభుత్వ పాఠశాల ఆవరణలో మురుగునీరు

సర్కార్ బడి.. సమస్యల ఒడి

- శిథిలావస్థలో ప్రభుత్వ పాఠశాలలు
- వంట గదులు, మరుగుదొడ్లు లేక ఇబ్బందులు
- అద్దె భవనాల్లో విద్యార్థుల అవస్థలు
- ఉపాధ్యాయుల కొరతతో ఇక్కట్లు

ఆంధ్రజ్యోతి విజిట్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం/ గద్వాల సర్కిల్ / అలంపూర్ చౌరస్తా/ నారాయణపేట/ కల్వకుర్తి/ పెద్దకొత్తపల్లి/ బిజినేపల్లి/ వనపర్తి విద్యా విభాగం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : విద్యాసంవత్సరం ఈనెల 12న ప్రారంభమయ్యింది. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు తెరుచుకున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌లు పంపిణీ చేశారు. తరగతులు కూడా కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో 'ఆంధ్రజ్యోతి' ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలు ప్రభుత్వ పాఠశాలలను పరిశీలించింది. సమస్యలను తెలుసుకున్నది. కొన్ని పాఠశాలలకు సొంత భవనాలు లేవు. ఉపాధ్యాయుల కొరత కొనసాగు తోంది. వంట గదులు, మరుగుదొడ్లు, మూత్రశాలలు లేవు. ఉన్నా నిర్వహణ సక్రమంగా లేక నిరుపయోగంగా ఉన్నాయి. అద్దె భవనాల్లో ఇరుకు గదులతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఆంధ్రజ్యోతి పరిశీలనలో వెల్లడైన వివరాలిలా ఉన్నాయి.


పాలమూరు పట్టణంలోని బీపీహెచ్‌ఎస్ ఆవరణలో నిలిచిన వర్షం నీరు

● భూత్పూర్ మండలం భట్టుపల్లిలోని ప్రాథమిక పాఠశాల అద్దె భవనంలో కొనసాగుతోంది. అసంపూర్తిగా ఆ భవనంలో పిల్లర్ల మధ్య, రేకుల గదిలో పాఠశాలను నిర్వహిస్తున్నారు.

● మహమ్మదాబాద్ మండలం బొట్లగడ్డ తండా పాఠశాలలో 10 మందికి పైగా విద్యార్థులు ఉన్నారు. ఇక్కడి ఉపా ధ్యాయులు గత ఏడాది జరిగి న బదిలీల్లో వేరే పాఠశాలలకు వెళ్లిపోయారు. దీం తో విద్యా బోధన సాగడం లేదు.

● మహమ్మదాబాద్ మండలం బోరింగ్ తండా పాఠశాల నాలుగేళ్లుగా మూతపడి ఉంది. ఇటీవల పాఠశాలకు ఉపాధ్యాయుడిని నియమించినా, డిప్యూటేషన్‌పై మరో పాఠశాలకు వెళ్లారు. దాంతో పాఠశాల మళ్లీ మూతపడింది. ఈ ఏడాది టీచర్‌ను ఏర్పాటు చేస్తామని ఎంఈవో రాజునాయక్ తెలిపారు.

● నారాయణపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఉర్దూమీడియం పాఠశాల శిథిలావస్థలో ఉన్న అద్దె భవనంలో కొనసాగుతోంది. చిన్న వర్షం వచ్చినా తరగతి గదుల్లోకి నీరుస్తోంది. ఐదు తరగ తులు ఉన్న ఈ పాఠశాలలో 18 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. ఉన్న రెండు ఇరుకు గదుల్లో ఒకవైపు విద్యాబోధన, మరో వైపు మధ్యాహ్న భోజనం వంటలు చేయాల్సి వస్తోంది.

● నాగర్‌కర్నూల్ జిల్లా, కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వ మండల ప్రజా పరిషత్ (దళితవాడ) పాఠశాల భవనం శిథిలావస్థకు చేరడంతో ప్రస్తుతం ఎస్సీ కమ్యూనిటీ హాల్లో కొనసాగిస్తున్నారు. 32 మంది విద్యార్థులు, ముగ్గురు ఉపాధ్యాయులు ఉన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించామని ప్రధానోపాధ్యాయిని బాలమణి తెలిపారు.

● పెద్దకొత్తపల్లి మండల పరిధిలోని బాచారం గ్రామంలో దశాబ్దాల క్రితం నిర్మించిన ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకున్నది. ఉన్న రెండు గదుల్లో ఒక దానికి తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. మరో గది పూర్తిగా శిథిలం అయ్యింది.

● బిజినేపల్లి మండలం, పాలెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవనం పూర్తిగా శిథిలమైంది. పలుమార్లు ఉన్నతాధికారులకు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదు.

● మండలంలోని గ్రూప్లోతండా, కల్వకుంట్ల తండా, అంజనాద్రినగర్, పాలెం ఉర్దూ మీడియం పాఠశాలల్లో విద్యార్థులు లేక మూత పడ్డాయి.

● వనపర్తి జిల్లా, అమరచింత మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 300 మంది విద్యార్థులుండగా, 4 మరుగుదొడ్లు మాత్రమే ఉన్నాయి. అవి కూడా అపరిశుభ్రంగా, అస్తవ్యస్తంగా ఉండడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

● ఖిల్లాఘణపురం మండలంలోని గిరిజన తండాల పాఠశాలల్లో తాగు నీటి సమస్య నెలకొన్నది. ప్రహరీ లేకపోవడంతో విద్యార్థులు అవస్థ పడుతున్నారు. స్కావెంజర్లు లేకపోవడంతో పాఠశాల పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయి. రోడ్డుమీది తండాలోని ప్రభుత్వ పాఠశాలలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది.

● గద్వాల మునిసిపాలిటీ పరిధిలోని గంజిపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పూర్తిగా శిథిలమైంది. పలుమార్లు పైకప్పు పెచ్చులూడి పడ్డాయి. దీంతో పాఠశాలను సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రానికి తరలించారు. అక్కడ ఒక్క గదిలోనే 5 తరగతులు కొనసాగుతున్నాయి. నూతన భవనం కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించినా, ఇప్పటివరకు కార్యరూపం దాల్చలేదు.

● పెద్ద అగ్రహారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల కూడా శిథిలావస్థకు చేరింది. వర్షం పడితే తరగతి గదుల పైకప్పులోంచి నీరు వస్తోంది. వంట గది లేదు.

● జిల్లాలోని చాలా పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పథకం (నాటి మన ఊరు-మన బడి పథకం) కింద చేపట్టిన పనుల తాలూకు బిల్లులు గుత్తేదారులకు అందకపోవడంతో పనులను మధ్యలోనే నిలిపి వేశారు. బిల్లులు చెల్లిస్తే తప్ప పనులు ముందుకు సాగే పరిస్థితి లేదు.

● ఉండవల్లి మండల పరిధిలోని మెన్నిపాడు ప్రాథమిక పాఠశాలలో గతేడాది వరకు 48 మంది విద్యార్థులున్నారు. బడిలో 5 తరగతి గదులుండగా, అందులో మూడు గదులు వర్షం వస్తే కురుస్తున్నాయి. దీంతో వానాకాలం తరగతులు అంతంత మాత్రంగానే కొనసాగుతున్నాయి. బడిలో మూత్రశాలలు, మరుగుదొడ్లు కూలిపోయాయి.

● నారాయణపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఉర్దూమీడియం పాఠశాల శిథిలావస్థలో ఉన్న అద్దె భవనంలో కొనసాగుతోంది. చిన్న వర్షం వచ్చినా తరగతి గదుల్లోకి నీరుస్తోంది. ఐదు తరగతులు ఉన్న ఈ పాఠశాలలో 18 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేస్తాం

అబ్దుల్ ఘని, ఇన్‌చార్జి డీఈవో, జోగులాంబ గద్వాల : త్వరలోనే పెండింగ్ పనులను పూర్తి చేయిస్తాం. శిథిలావస్థకు చేరుకున్న పాఠశాల భవనాలను పరిశీలిస్తాం. సమస్య పరిష్కారానికి కలెక్టర్ పర్యవేక్షణలో చర్యలు తీసుకుంటాం.


శిథిలావస్థకు చేరిన ఎంపీపీఎస్ హెచ్‌డబ్ల్యూ పాఠశాల భవనం


పేట బాలికల పాఠశాల ఆవరణలో నిలిచిన వర్షపు నీరు

జగద్గురువుల రాకతో పాలమూరు పావనం


జగద్గురువులకు స్వాగతం పలుకుతున్న స్థానికులు


మాట్లాడుతున్న మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ

- మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ
- భక్తిశ్రద్ధలతో యుగమానోత్సవం
- వందలాదిగా తరలి వచ్చిన భక్తులు

భూత్పూర్, జూన్ 16(ఆంధ్రజ్యోతి) : జగద్గురువుల రాకతో పాలమూరు పావనమైందని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా, భూత్పూర్ మునిసిపాలిటీ కేంద్రంలోని వాసవీ కల్యాణ మండపంలో సోమవారం పంచాచార్య యుగమానోత్సవం, మహాత్మా బసవేశ్వర జయంతి వేడుకలను వైభవంగా నిర్వహించారు. వీరశైవ సమాజం జిల్లా, మండల అధ్యక్షుడు ముక్త శ్రీశైలం, నాగరాజుల అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో జగద్గురువులు ఉజ్జయిని సద్ధర్మ సింహ సనాదీశ్వర సిద్ధలింగ శివాచార్యులు, శ్రీశైల సూర్య సింహాసనాధీశ్వర సిద్ధరామ పండితారాధ్య శివాచార్యులు, కాశీజ్ఞాన సింహాస నాధీశ్వర చంద్రశేఖర శివాచార్యులు, మల్లికార్జున విశ్వారాధ్య శివాచార్య మహాస్వాములు పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా ఎంపీ డీకే అరుణ, పాలమూరు ఎమ్మెల్యే యన్నెం శ్రీనివాస్‌రెడ్డి, మునిసిపల్ మాజీ చైర్మన్ ఆనంద్‌గౌడ్, వివిధ పీఠాల అధిపతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డీకే అరుణ మాట్లాడుతూ ప్రతీ మనిషి ధర్మ సంరక్షణ కోసం పాటు పడాలన్నారు. హిందు ధర్మ సంస్థాపనకు కేంద్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని తెలిపారు. అనంతరం జగద్గురువులు భక్తులనుద్దేశించి మాట్లాడారు. పాలమూరు జిల్లాకు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. దేవుడు ఎక్కడో లేడని, మంచి మనసున్న ప్రతీ ఒక్కరిలో కొలువై ఉన్నాడని తెలిపారు. ప్రతీ ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవరచుకోవాలని సూచించారు. ఇస్లాం మతానికి ఉన్నట్లుగానే వీరశైవ లింగాయత్‌లకు కూడా 856 అనే సంఖ్య ఉందని శ్రీశైల సూర్య సింహాసనాధీశ్వర శివాచార్య మహాస్వామి భక్తులకు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల అభ్యున్నతికి కృషి

- రాష్ట్ర విద్యాకమిషన్ సభ్యుడు చారకొండ వెంకటేశ్
- కొండారెడ్డిపల్లి, చారకొండ ప్రభుత్వ పాఠశాలల తనిఖీ
- తెలంగాణ పబ్లిక్ స్కూల్ నిర్మాణానికి స్థల పరిశీలన


చారకొండ ప్రభుత్వ పాఠశాలలో రిజిస్టర్‌ను తనిఖీ చేస్తున్న విద్యా కమిషన్ సభ్యుడు చారకొండ వెంకటేశ్

వంగూరు/ చారకొండ, జూన్ 16; (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల అభ్యున్నతికి కృషి చేస్తోందని విద్యా కమిషన్ రాష్ట్ర సభ్యుడు చారకొండ వెంకటేశ్ అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా, వంగూరు మండలంలోని కొండారెడ్డిపల్లి, చారకొండ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం మేరకు కొండారెడ్డిపల్లో తెలంగాణ పబ్లిక్ స్కూల్ నిర్మాణానికి స్థల పరిశీలించి, ఉపాధ్యాయులతో చర్చించారు. అనంతరం చారకొండ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. రిజిస్టర్లను పరిశీలించారు. విద్యార్థులతో తెలుగు, ఆంగ్లం పాఠ్యాంశాలను చదివించి సామర్థ్యాలను తెలుసుకున్నారు. జీహెచ్‌ఎం భగవాన్‌రెడ్డితో మాట్లాడి విద్యార్థుల సంఖ్య, వసతుల వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన విద్యబోధన చేయాలని సూచించారు. పాఠశాలల్లో వసతుల కల్పనకు కృషి చేస్తామని తెలిపారు. ఆర్‌వో ప్లాంట్, క్రీడా మైదానం, ముత్రశాలలు, మరుగుదొడ్లు తదితర పనులను పూర్తి చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. వంగూరులో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. చారకొండ, రంగాపూర్ గ్రామాల్లోనూ పబ్లిక్ స్కూళ్ల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. ఈ విషయంపై ముఖ్యమంత్రికి నివేదిక అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమాల్లో వంగూరు మాజీ ఉప సర్పంచ్ వేమారెడ్డి, పులిజాల కృష్ణారెడ్డి, హెచ్‌ఎం మురళీధర్‌రెడ్డి, పీఏసీ ఎస్ చైర్మన్ గురువయ్యగౌడ్ పాల్గొన్నారు.

ఈ నెల 20న ఇంటర్నేషనల్ వెబినార్

- పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్


వెబినార్ బ్రౌచర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్, అధికారులు

పాలమూరు యూనివర్సిటీ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని 'కాన్షియస్ లివింగ్' అంశంపై ఈ నెల 20న ఇంటర్నేషనల్ వెబినార్ నిర్వహించనున్నట్లుపాఆలమూరు యూనివర్సిటీ వీసీ జీఎన్ శ్రీనివాస్ తెలిపారు. ఎన్ఎస్ఎస్ సెల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వెబినార్ బ్రోచర్‌ను సోమవారం యూనివర్సిటీ అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వెబినార్ కీనోట్ స్పీకర్‌గా ఆస్ట్రేలియా నుంచి ప్రొఫెసర్ సరోజ గుల్లపల్లి హాజరు కానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కోకన్వీనర్లు డాక్టర్ రవికుమార్, డాక్టర్ అర్జున్‌కుమార్, ప్రోగ్రాం ఆఫీసర్లు పాల్గొన్నారు.

వేర్వేరు చోట్ల ఇద్దరి అదృశ్యం

భూత్పూర్/ జడ్చర్ల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లాలోని భూత్పూర్, జడ్చర్ల మండలాల్లో ఇద్దరు ఇద్దరు అదృశ్యం అయ్యారు. భూత్పూర్ ఎస్‌ఐ చంద్రశేఖర్, జడ్చర్ల సీఐ కమలాకర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. భూత్పూర్ మండలంలోని కర్వెన గ్రామానికి చెందిన బర్రెల కృష్ణవేణి (34) ఈ నెల 14న ఆసుపత్రికి వెళ్లి వస్తానని ఇంట్లో వారికి చెప్పి బయటకు వెళ్లి, తిరిగి రాలేదు. దీంతో భర్త భీమయ్య, అదే గ్రామానికి చెందిన బావమరిది తిరుపతి ఇద్దరూ కలిసి బంధువులు, తెలిసిన వారి ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపారు.

- జడ్చర్ల మునిసిపాలిటీ పరిధిలోని ఇందిరానగర్ కాలనీ ప్రాంతానికి చెందిన మంగలి సంతోష్‌కుమార్ ఆదివారం ఉదయం 6 గంటలకు లక్ష్మీనగర్‌కాలనీలోని తన సెలూన్‌కు వెళ్లాడు. మధ్యాహ్నం భోజనానికి రాకపోవడంతో భార్య సంధ్య సెలూన్ వద్దకు వెళ్లింది. కానీ ఆయన అక్కడ కనిపించలేదు. ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ మెసేజ్ వచ్చింది. దీంతో బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెతికింది. కానీ ఆచూకీ లభించకపోవడంతో సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

రైతు భరోసా దరఖాస్తుకు అవకాశం

● ధన్వాడ మండల వ్యవసాయాధికారి నవీన్‌కుమార్



ధన్వాడ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ పెట్టుబడి కోసం రైతులు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉందని ధన్వాడ మండల వ్యవసాయ అధికారి నవీన్‌కుమార్ తెలిపారు. మండలంలోని రైతులు అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు. సోమవారం 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఏవో పలు అంశాలపై మాట్లాడారు.

రైతు భరోసాకు ఎవరు దరఖాస్తు చేసుకోవాలి?

కొత్తగా పాసు పుస్తకం పొందిన రైతులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి.

ఇంతకుముందు రైతు భరోసా పొందిన వారు దరఖాస్తు చేసుకోవాలా?

అవసరం లేదు. ఇంతకుముందు రైతు భరోసా వచ్చే రైతులు కేవలం బ్యాంక్ అకౌంట్ మార్చుకోగలిగితే దరఖాస్తు చేసుకోవాలి.

దరఖాస్తు వెంట ఏఏ పత్రాలు సమర్పించాలి?

రైతు భరోసా దరఖాస్తు ఫారం, పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్, ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా జిరాక్స్‌లు అందివ్వాలి.

దరఖాస్తును ఎప్పటివరకు సమర్పించాలి?

ప్రభుత్వం ఈనెల 20 వరకు గడువు ఇచ్చింది. అప్పటివరకు దరఖాస్తు చేసుకోవాలి.

గ్రామాల్లో ఏమైనా ప్రచారం చేశారా?

మా ఏఈవోల ద్వారా రైతులకు సమాచారం ఇచ్చాం.

న్యూస్ బాక్స్

అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు

నారాయణపేట రూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): సొంతిల్లు లేని అర్హులైన ప్రతీ ఒక్కరికీ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని ఆ పార్టీ మండల అధ్యక్షుడు, పేట వ్యవసాయ మార్కెట్ చైర్మన్ రాంపురం సదాశివారెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని జిలాల్‌పూర్ గ్రామంలో పేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి, కుంభం శివకుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు ఇందిరమ్మ ఇళ్లకు ఆయన భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు హన్మంతు, శివప్ప, అంజప్ప, లింగం, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈనెల 19 వరకు డిగ్రీ చివరి విడత అడ్మిషన్లు

మక్తల్‌రూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): డిగ్రీ ప్రథమ సంవత్సరంలో చేరేందుకు దోస్త్-2025 ద్వారా మూడవ, చివరి విడత ద్వారా ఈనెల 19 వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని మక్తల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నారాయణగౌడ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి, రెండో విడతల్లో సీట్లు పొందని వారు ఈనెల 19లోపు రిజిస్ట్రేషన్ చేసుకొని వెబ్ ఆప్షన్స్ ఇచ్చుకోవాలని పేర్కొన్నారు.

బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ

ఊట్కూర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఊట్కూర్ ఎస్ఐగా వి.రమేశ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు ఇక్కడ పనిచేసిన ఎస్ఐ కృష్ణంరాజును పేట వీఆర్‌కు బదిలీ చేయడంతో నాగర్‌కర్నూల్ జిల్లా వీఆర్‌లో పనిచేస్తున్న వి.రమేశ్‌ను ఊట్కూర్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. రమేశ్‌ను సిబ్బంది సన్మానించి, అభినందనలు తెలిపారు.

జీపీఎఫ్ ఖాతాలు ఆన్‌లైన్ చేయాలి

నారాయణపేట న్యూటౌన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల జీపీఎఫ్ ఖాతాలను ఆన్‌లైన్ చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం నారాయణపేట జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి శైలేంద్రకు సోమవారం వినతిపత్రం అందించారు. సిబ్బంది కొరత వల్ల జీపీఎఫ్ ఖాతాలు పెండింగ్‌లో ఉన్నాయని, వెంటనే ఆన్‌లైన్ చేస్తామని సీఈవో తెలిపారు. సంఘం జిల్లా అధ్యక్షుడు శేర్‌కృష్ణారెడ్డి, నాయకులు నరసింహ, కిశోర్‌కుమార్ ఉన్నారు.

అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

నారాయణపేటరూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మహిళలు, విద్యార్థులు అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలని షీ టీం పోలీసు కవిత అన్నారు. సోమవారం మండల పరిధిలోని కొల్లంపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ అపరిచితుల వల్ల ఎలాంటి ఇబ్బందులు ఏర్పడినా టీ సేఫ్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయాలన్నారు. షీటీం పోలీసులు జ్యోతి, బాలరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుండె వైద్య శిబిరం విజయవంతం

మరికల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని దర్శన్ హాస్పిటల్‌లో సోమవారం నిర్వహించిన గుండె వైద్య శిబిరం విజయవంతమైంది. శిబిరంలో దాదాపు వంద మందికి మెడికవర్ హాస్పిటల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ దామోదర్‌రెడ్డి గుండె సంబంధిత పరీక్షలు నిర్వహించినట్లు ఆసుపత్రి వైద్యుడు రాకేష్ తెలిపారు. రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశామన్నారు.

మొక్కలు పెంచి, కాపాడాలి

» వన మహోత్సవంలో శాఖల వారీగా లక్ష్యాన్ని పూర్తి చేయాలి

» కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేటటౌన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా ప్రతీ శాఖ తమ పరిధిలో మొక్కలు పెంచి కాపాడాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. సోమవారం వన మహోత్సవ కార్యక్రమంలో ఆయా శాఖలకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని నాలుగు మునిసిపాలిటీలలో మొక్కలు పెంచాలన్నారు. అగ్రికల్చర్ 0.89, పశు సంవర్థక శాఖ 0.01, డీఆర్డీవో 8.66, ఎలక్ట్రికల్ 0.01, ఎక్సైజ్ 0.25, ఫారెస్టు 0.43, హార్టికల్చర్ 1.23, మునిసిపాలిటీలు 3.87, మొత్తం 15.41 శాతం టార్గెట్ నిర్వహించినట్లు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్యం అందించాలి

పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. సోమవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయం సమావేశం గదిని కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం కార్యాలయ గదులను, పరిసరాలను పరిశీలించి ఎప్పటికప్పుడు కార్యాలయాన్ని శుభ్రంగా ఉంచుకోవాలని, సమావేశపు గది నిర్వహణ చాలా చక్కగా చేశారని డీఎంహెచ్‌వో డాక్టర్ జయచంద్రమోహన్‌ను ప్రశంసించారు. అలాగే వైద్య ఆరోగ్యశాఖ చాల కీలకమైనదని, అన్ని కార్యక్రమాల్లో లక్ష్యాల పరంగా పురోగతి సాధించాలని, కొత్తగా వచ్చిన ప్రోగ్రామ్ అధికారులు, సిబ్బంది అందరూ కలిసికట్టుగా పని చేసి వైద్య ఆరోగ్యశాఖకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.శైలజ, డీపీవో భిక్షపతి, సబ్ యూనిట్ అధికారి అశోక్‌కుమార్, ఆరోగ్య విస్తరణ అధికారులు విజయ్‌కుమార్, గోవిందరాజులు, ఫార్మాసిస్ట్ సూర్యకాంత్‌రెడ్డి, డీడీఎం రాఘవేందర్, సిబ్బంది పాల్గొన్నారు.



జిల్లా అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

ప్రజావాణికి 45 ఫిర్యాదులు..

ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులకు సూచించారు. ప్రజావాణి సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమానికి 45 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు, అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్‌లకు దరఖాస్తులు సమర్పించారు.

మాదక ద్రవ్యాల నిషేధం అమలుకు చర్యలు



మాదక ద్రవ్యాల నిషేధానికి సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేస్తున్న డీఎస్పీ లింగయ్య, అధికారులు

నారాయణపేట టౌన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మాదక ద్రవ్యాల నిషేధం అమలుకు పకడ్బందీ చర్యలు చేపడుతున్నట్లు డీఎస్పీ నల్లపు లింగయ్య తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీసీ హాల్‌లో మాదక ద్రవ్యాల నిషేధంపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని జూనియర్, డిగ్రీ, కళాశాలల్లో యాంటీ డ్రగ్ కమిటీలను ఏర్పాటు చేశామని, ఆయా కమిటీల నేతృత్వంలో మాదకద్రవ్యాల నిషేధంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. గతంలో నమోదైన గంజాయి కేసులే తప్ప కొత్త కేసులేవీ లేవని ఆయన చెప్పారు. తమ శాఖతో పాటు రెవెన్యూ, వ్యవసాయ, ఎక్సైజ్, వైద్యశాఖ అధికారులు నిషేధం అమలుకు సమష్టిగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో జయచంద్రమోహన్, ఆర్డీవో రాంచందర్‌నాయక్, ఆర్డీవో మేఘాగాంధీ, కలెక్టరేట్ ఏవో జయసుధ, సీ-సెక్షన్ అధికారా రాణిదేవి, జీసీడీవో నర్మద, డీఐఈవో సుదర్శన్, భిక్షపతి, ఎక్సైజ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి



డయేరియా వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న జిల్లా వైద్యాధికారి జయచంద్రమోహన్, ఇమ్యూనైజేషన్ అధికారి శైలజ

» జిల్లా వైద్యాధికారి జయచంద్ర మోహన్

నారాయణపేటటౌన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): వ్యాధుల బారిన పడకుండా ప్రతీ ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని జిల్లా వైద్యాధికారి జయచంద్రమోహన్ అన్నారు. సోమవారం జిల్లా స్థాయిలో స్టాప్ డయేరియా కార్యక్రమాన్ని పీపీ యూనిట్‌లో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డా.శైలజతో కలిసి ఆయన ప్రారంభించారు. నేటి నుంచి జులై 31 వరకు ఈ స్టాప్ డయేరియా కార్యక్రమం కొనసాగుతుందన్నారు. పుట్టినప్పటి నుంచి ఐదేళ్లలోపు పిల్లలు డయేరియా వ్యాధి వలన మరణాలు సంభవించే అవకాశం ఉందన్నారు. ఈ మరణాలను నిరోధించడమే ఈ కార్యక్రమం ముఖ్య లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు గృహ సందర్శన చేసి ఏ ఇంట్లో అయితే ఐదేళ్లలోపు పిల్లలు ఉంటే వారికి రెండు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఒక స్ట్రిప్ జింక్ టాబ్లెట్స్ అందించాలన్నారు. అలాగే, ప్రతీ తల్లికి ఓఆర్ఎస్ ద్రావణాన్ని తయారుచేసే విధానాన్ని, ఉపయోగించే పద్ధతిని తల్లులకు వివరిస్తారన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారులు గోవిందరాజు, అశోక్‌కుమార్, విజయ్‌కుమార్, సూపర్‌వైజర్ సబితారాణి, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

బాధితులకు సత్వర న్యాయం చేయాలి

నారాయణపేట న్యూటౌన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): బాధితులకు సత్వర న్యాయం చేయాలని నారాయణపేట డీఎస్పీ లింగయ్య అధికారులను ఆదేశించారు. డీఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో డీఎస్పీ నల్లపు లింగయ్య జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన నలుగురు ఫిర్యాదుదారులతో మాట్లాడి వారి సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. బాధితులు మధ్యవర్తులను తీసుకురావొద్దని ఆయన సూచించారు.

ప్రధాని నేతృత్వంలో బలమైన శక్తిగా భారత్

» బీజేపీ రాష్ట్ర ఓబీసీ అధికార ప్రతినిధి శంకరోళ్ళ రవికుమార్

మాగనూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో బలమైన శక్తిగా భారతదేశం ఎదుగుతోందని బీజేపీ రాష్ట్ర ఓబీసీ అధికార ప్రతినిధి శంకరోళ్ళ రవికుమార్ అన్నారు. సోమవారం మాగనూరు మండలంలోని కొత్తపల్లి గ్రామంలో బీజేపీ రచ్చబండ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. మోదీ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ఇంటింటికి వెళ్లి బీజేపీ గెలుపునకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ ఉమ్మడి మండల అధ్యక్షుడు నర్సప్ప, జిల్లా ఉపాధ్యక్షుడు సోమశేఖర్‌గౌడ్, మాజీ మండలాధ్యక్షుడు జయానందరెడ్డి, గొల్ల నారాయణ, మాజీ సర్పంచు తిమ్మప్ప, వాకిటి మల్లేష్, సోమశేఖర్‌గౌడ, ఆంజనేయులు, అశోక్ గౌడ్, భరత్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

మట్టి రోడ్లపై పారుతున్న మురుగు



అలంపల్లి గ్రామంలో మట్టి రోడ్డుపై నిలిచిన మురుగునీరు

» పట్టించుకోని అధికారులు

» ఇబ్బందులు పడుతున్న అలంపల్లి గ్రామస్థులు

కృష్ణ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అలంపల్లి గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు లేక వర్షం నీరు, మురుగు కాలువ నీరు మట్టి రోడ్లపై, నివాసాల ముందు పారుతున్నాయని ఆ గ్రామస్థులు వాపోయారు. గ్రామంలో పారిశుధ్య కార్మికులు లేక ఎక్కడ పడితే అక్కడ చెత్తాచెదారం పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోందని, దీంతో దోమలు విపరీతంగా పెరిగాయని పేర్కొన్నారు. గ్రామంలో పందుల సంచారంతో కాలినడక సైతం తాము ఇబ్బంది పడుతున్నామన్నారు. మండల పరిషత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. ఏ శాఖ అధికారులకు సమస్యను చెప్పుకున్నా తమది కాదంటే తమది కాదని దాటవేత ధోరణిని అవలంబిస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి వెంటనే గ్రామంలో మురుగు కాలువ పూడికల తీయించడంతో పాటు, పారిశుధ్య కార్మికులను నియమించి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

తహసీల్దార్‌కు సన్మానం

కోస్గి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ రక్తదాత అవార్డు అందుకున్న కోస్గి తహసీల్దార్ శ్రీనివాసులును కాడా అధికారి వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు సన్మానించారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్‌ను సత్కరించిన అనంతరం ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ వార్ల విజయ్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రఘువర్దన్‌రెడ్డి, నాయకుడు నరేందర్ తదితరులున్నారు.

ఊట్కూర్ ఎంఈవోగా మాధవి



ఊట్కూర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఊట్కూర్ మండల విద్యాధికారిగా మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాల జీహెచ్ఎం కె.మాధవిని నియమిస్తూ సోమవారం రాష్ట్ర విద్యాసంచాలకులు ఉత్తర్వులను జారీ చేశారు. గతంలో ఎంఈవోగా పనిచేసిన చిన్నపొర్ల పాఠశాల జీహెచ్ఎం రామచంద్రాచారి పదవీ విరమణ కావడంతో ఆయన స్థానంలో మండలంలో సీనియర్ జీహెచ్ఎంగా ఉన్న కె.మాధవిని నూతన ఎంఈవోగా నియమిస్తూ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ నుంచి ఉత్తర్వులు జారీ చేశారు.

నర్వ ఎంఈవోగా రాంరెడ్డి



నర్వ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండల నూతన విద్యాశాఖ అధికారిగా రాంరెడ్డిని తెలంగాణ విద్యాశాఖ నియమించింది. ఉంద్యాకోడ్ జడ్పీహెచ్ఎస్‌లో హెచ్ఎంగా పనిచేస్తున్న రాంరెడ్డికి నర్వ ఎంఈవోగా బాధ్యతలు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు ఎంఈవో రాంరెడ్డికి అభినందనలు తెలిపారు.

క్రీడా పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

నారాయణపేట న్యూటౌన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలంగాణ ప్రభుత్వ క్రీడా పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి గాను 4వ తరగతిలో ప్రవేశానికి అర్హులైన బాలబాలికల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ఎంఈవో బాలాజీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 01.09.2016 నుంచి 30 ఆగస్టు 2017లో జన్మించిన విద్యార్థులు తమ 3వ తరగతి ప్రోగ్రెస్ కార్డు, బోనఫైడ్, 10 పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో హాజరు కావాలన్నారు. నారాయణపేట మండల స్థాయి క్రీడా పాఠశాల విద్యార్థుల ఎంపిక ఈనెల 18న ఉదయం 9 గంటలకు పట్టణంలోని మినీ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

రేపు మండల స్థాయి పోటీలు

మక్తల్‌రూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని క్రీడా పాఠశాల ప్రవేశాలకు బుధవారం మండల స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించనున్నామని ఎంఈవో అనిల్‌గౌడ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులకు ఈనెల 18న మక్తల్ పట్టణంలోని మినీ స్టేడియంలో ఎంపిక పోటీలు నిర్వహిస్తామన్నారు. పోటీల్లో నైపుణ్యం ప్రదర్శించిన వారిని జిల్లా స్థాయి ఎంపికలకు పంపుతామని పేర్కొన్నారు. ప్రస్తుతం నాలుగో తరగతికి వెళ్తున్న విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

కోర్టు విధులు బహిష్కరించిన న్యాయవాదులు

నారాయణపేట న్యూటౌన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): న్యాయవాది, బార్ అసోసియేషన్ మాజీ కోశాధికారి సి.నారాయణను కిడ్నాప్ చేసి హత్యాయత్నానికి పాల్పడడాన్ని నిరసిస్తూ సోమవారం నారాయణపేట జిల్లా కోర్టులో న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దామోదర్‌గౌడ్ మాట్లాడుతూ న్యాయవాదులపై ఇటీవల దాడులు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. న్యాయవాదుల రక్షణ కోసం ప్రత్యేక చట్టం తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే, కిడ్నాప్ చేసి, హత్యాయత్నానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు నందునామాజీ, ప్రధాన కార్యదర్శి చెన్నారెడ్డి, కార్యదర్శి అమిరుద్దీన్, కోశాధికారి కృష్ణగౌడ్, న్యాయవాదులు పాల్గొన్నారు.

విద్యార్థులు బాగా చదువుకోవాలి

» ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి

» పేట ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు, స్కూల్ డ్రెస్‌లు పంపిణీ



పేట గ్రౌండ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు స్కూల్ డ్రెస్‌లు అందిస్తున్న ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి

నారాయణపేట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు బాగా చదువుకొని పుట్టిన ఊరికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి అన్నారు. సోమవారం నారాయణపేట ప్రభుత్వ గౌండ్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆమె పాఠ్య పుస్తకాలు, స్కూల్ డ్రెస్‌లు, నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తోందన్నారు. ఈ విద్యా సంవత్సరం ఆరంభంలోనే పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, స్కూల్ యూనిఫామ్స్ అందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో డీఈవో గోవిందరాజులు, హెచ్ఎం అంబదాస్, మార్కెట్ చైర్మన్ శివారెడ్డి, ఆర్టీవో బోర్డు మెంబర్ పోషల్ రాజేష్, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎండీ.సలీం, మాజీ మార్కెట్ చైర్మన్ బండి వేణుగోపాల్ తదితరులున్నారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు పంపిణీ

నారాయణపేటలోని సీవీఆర్ బంగ్లాలో సోమవారం సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి పంపిణీ చేశారు. పేట మునిసిపాలిటీకి చెందిన 15 మంది లబ్ధిదారులకు ఆమె చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఉన్నారు.

సీఎం వీసీలో పాల్గొన్న ఎమ్మెల్యే, కలెక్టర్

దామరగిద్ద/మక్తల్ రూరల్/ఊట్కూర్/మరికల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా సోమవారం రాష్ట్రంలోని 1031 రైతు వేదికల్లో సీఎం రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. దామరగిద్దలోని రైతువేదికలో కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరై రైతులతో కలిసి కార్యక్రమాన్ని తిలకించారు. అలాగే, బాపన్‌పల్లి రైతువేదికలో తహసీల్దార్ తిరుపతయ్య, లోకుర్తి రైతువేదికలో ఎంపీడీవో సాయిలక్ష్మి ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. విండో చైర్మన్ పుట్టి ఈదప్ప, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జాన్‌సుధాకర్, హార్టికల్చర్ అధికారి సాయిబాబా, ఏవో మనిచందర్, రైతులు పాల్గొన్నారు.

అదేవిధంగా, మక్తల్ మండలంలోని రుద్రసముద్రం రైతువేదికలో అడిషనల్ కలెక్టర్ సంచిత్ గంగ్వార్, ఎంపీడీవో రమేష్, జక్లేర్ రైతు వేదికలో తహసీల్దార్ సతీష్‌కుమార్, గడ్డంపల్లిలో ఏవో మిథున్‌చక్రవర్తి, ఊట్కూర్‌లో ఎంపీడీవో ధనుంజయ్‌గౌడ్, ఎంపీవో లక్ష్మీనరసింహారాజు, ఏవో గణేష్‌రెడ్డి, ఏఈవోలు, మరికల్‌లోని రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఏవో రహమాన్, ఏఈవో పరశురాం, తహసీల్దార్ రామ్‌కోటి, ఆర్ఐ సుధాకర్‌రెడ్డి, రెవెన్యూ, వ్యవసాయ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందించాలి

» మునిసిపల్ కమిషనర్ నాగరాజు



వార్డు సమస్యలపై కమిషనర్‌ను నిలదీస్తున్న జైపాల్‌రెడ్డి

కోస్గి/మక్తల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని, వార్డుల్లో ఏదైన సమస్య ఉంటే వార్డు అధికారులకు సమాచారం అందించాలని కోస్గి కమిషనర్ నాగరాజు అన్నారు. సోమవారం వందరోజుల ప్రణాళికలో భాగంగా కోస్గి మునిసిపాలిటీలోని 8వ వార్డులో ఆయన పర్యటించారు. వార్డులో తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించి, వార్డు సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

కాగా వార్డు సమస్యలపై జైపాల్‌రెడ్డి అనే వ్యక్తి అధికారులను నిలదీశాడు. వార్డులో గత ఐదేళ్లుగా ఏ పనీ చేపట్టలేదన్నారు. డ్రైనేజీ సరిగ్గా లేదని, రోడ్లు దయనీయంగా మారాయని, ఏనాడూ పట్టించుకోకుండా ఏదో ఒక ప్రభుత్వ కార్యక్రమం పేరుతో వార్డులో తిరుగుతున్నారన్నారు. త్వరలో పనులు చేయిస్తామని నీళ్లు నములుతూ అధికారులు వెనుదిరిగారు. మునిసిపల్ సిబ్బంది వెంట ఉన్నారు.

అదేవిధంగా, మక్తల్ పురపాలకలోని 11వ వార్డు రెడ్డినగర్‌లో పట్టణ ప్రజలకు మునిసిపల్ కమిషనర్ శంకర్ తడి, పొడి చెత్త వేరు చేయడం, బ్లీచింగ్ వేయడం, సీజనల్ వ్యాధులు రాకుండా ముందుజాగ్రత్తలు, ఎనిమల్ బర్త్ కంట్రోల్ గురించి, ప్లాస్టిక్ బ్యాగుల వాడకం గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్, వార్డు అధికారి, మునిసిపల్ సిబ్బంది మెప్మా ఆర్పీలు జ్యోతి, కవిత, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులో భారీగా ఫిర్యాదులు

నారాయణపేట/ఊట్కూర్/మాగనూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట పళ్లబురుజు శివారులోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద సోమవారం రెవెన్యూ అధికారులు భూభారతి సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ అమరేందర్ కృష్ణ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రతాప్‌రెడ్డితో పాటు, సిబ్బంది రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. పళ్లబురుజు శివారు నుంచి 52 మంది, కొండారెడ్డిపల్లి శివారు నుంచి 30, గొల్లపల్లి శివారు నుంచి నలుగురు రైతులు తమ భూసమస్యలపై ఫిర్యాదులు ఇచ్చారు. కార్యక్రమంలో టీకేఎస్ రాష్ట్ర జోనల్ కార్యదర్శి వెంకోబా, జిల్లా కార్యదర్శి అనంత్‌రెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ బండి వేణుగోపాల్, లక్ష్మీనారాయణ, మల్లప్ప యాదవ్ తదితరులున్నారు.

అదేవిధంగా, ఊట్కూర్‌లో రెవెన్యూ అధికారులు భూభారతి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సదస్సులో పాస్ పుస్తకాలు రాని వారు, పేర్లు తప్పుగా వచ్చిన వారు, భూమి తక్కువగా ఉన్నవారు ఫిర్యాదులను ఇచ్చారు. సదస్సులో 64 ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా తహసీల్దార్ రవి మాట్లాడుతూ రైతుల నుంచి వచ్చిన సమస్యలను రికార్డుపరంగా పరిశీలించి, పరిష్కరిస్తామని తెలిపారు.

మాగనూరులో నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ నాగలక్ష్మి మాట్లాడారు. గ్రామంలోని రైతులు భూసమస్యలు ఉంటే భూభారతి కార్యక్రమంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీశైలం, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కూల్ బ్యాగుల వితరణ



విద్యార్థులకు బ్యాగులను అందజేస్తున్న ఉపాధ్యాయుడు రాంకిరణ్

మక్తల్‌రూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మక్తల్ మండలం రుద్రసముద్రం ప్రాథమికోన్నత పాఠశాలలో సెకండ్ గ్రేడ్ టీచర్‌గా పనిచేస్తున్న చింతకుంట రాంకిరణ్ తాను పనిచేసే పాఠశాలలో విద్యార్థులకు సోమవారం స్కూల్ బ్యాగులను అందించారు. పాఠశాలలోని 180 మంది విద్యార్థినీ, విద్యార్థులకు తన సొంత ఖర్చులు రూ.25 వేలు వెచ్చించి బ్యాగులను హెచ్ఎం హేమలత చేతు లమీదుగా అందించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు రాంకిరణ్‌ను హెచ్ఎం అభినందించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు కుమార్, ప్రహ్లాద్, మంజులత, దివ్య జ్యోతి, ఆంజనేయులు, వరుణ్‌కుమార్ తదితరులున్నారు.

● కొత్తపల్లి : మండలంలోని అల్లీపూర్, గొర్లోనిబాయిలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు గొర్లోనిబాయి గ్రామానికి చెందిన యువకులు కవాలి సతీష్‌కుమార్, సూర్యకిరణ్‌లు నోట్‌బుక్కులు పంపిణీ చేశారు.

జడ్పీహెచ్ఎస్‌కు బీరువా వితరణ

దామరగిద్ద, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): 1999-2000 సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థులు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో గత నెలలో సిల్వర్ జూబ్లీ వేడుకలు జరుపుకున్నారు. ఈ క్రమంలో తాము చదువుకున్న పాఠశాలకు ఏదైనా గుర్తుగా ఇవ్వాలనే ఉద్దేశంతో వారు సోమవారం బీరువాను బహూకరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు పూర్వ విద్యార్థులను అభినందించారు.



దామరగిద్ద జిల్లా పరిషత్ హైస్కూల్‌కు బీరువాను అందిస్తున్న పూర్వ విద్యార్థులు